# చిల్లర

డింభకా హోటల్‌లో టీ తాగి, బిల్ తీసుకుని కౌంటర్ వద్దకు నడిచాడు రామారావు.

కౌంటర్ మీద బిల్ పెట్టి, ఒక రూపాయి నోటు తీసి కౌంటర్‌లో వున్నతనికి ఇచ్చాడు.

అది పుచ్చుకుని కౌంటరతను రామారావు చేతిలో చాక్‌లెట్ పెట్టాడు.

రామారావు అది చూసి ఆశ్చర్యపోయి, "ఏమండీ! నేను టీ తాగి బిల్ పే చేసాను. నాకు చాక్‌లేట్ కావాలని అడగలేదే? మరి మీరు దేనికిచ్చినట్టు?" అంటూ అడిగాడు.

చెవుల దాకా నవ్వి, "మీరడగకపోయినా మేమిచ్చాం. ఎందుకంటే టీ డెబ్బయ్ అయిదు పైసలు. చారానా (ఇరవై అయిదు పైసలు) లేవు. అందుకే ఈ చారానా విలువచేసే చాక్‌లేట్ ఇచ్చాను, అడ్జెస్ట్ చేసుకోండి" అని అన్నాడు కౌంటరతను.

రామారావు నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు.

అప్పుడు కౌంటరతను కౌంటర్ పక్కగా వున్న స్టూలుమీద కూర్చున్న పన్నెండేళ్ళ తన కొడుకుతో, "ఒరేయ్ టింకూ— చూశావా



నా తెలివి?" అని అడిగాడు.

"ఇందులో తెలివి ఏముంది నాన్నా! చారానా లేకపోతే చారానా విలువచేసే చాక్‌లెట్ ఇచ్చావ్. అంతేగా?" అన్నాడు టింకు.

"నీ మొహం" అంటూ డ్రా లాగి, "ఇదిగో, ఇందులో చూడు" అని అనగానే టింకు అందులోకి చూసి ఆశ్చర్యపోయాడు. అందులో కావల్సినంత చిల్లరుంది. అయిదుపైసల బిళ్ళలు కూడా లెక్కలేనన్ని వున్నాయి.

"ఇంత చిల్లర పెట్టుకుని చిల్లర లేదని చాక్‌లెట్ ఎందుకు ఇస్తున్నావ్ నాన్నా?" అత్యంత ఆసక్తితోనూ, ఆశ్చర్యంతోనూ అడిగాడు టింకు.

"అదేరా ట్రేడ్ సీక్రెట్. చూడు... ఇలా చిల్లరంతా పోగుచేసి, కమిషన్‌కి చిల్లర అమ్ముకోవడం ఒక లాభం. ఇరవై అయిదు పైసల బదులు నేనిచ్చేది చాక్‌లెట్‌లు. అలా చాక్‌లెట్‌లు అమ్మితే వచ్చే లాభం రెండవది. ఇంకో రహస్యం వింటే మరింత ఆశ్చర్యపోతావ్. ఆ చాక్‌లెట్ ఖరీదు పదిపైసలే! అంటే, అందులో కూడా లాభమేగా! ఒక్క చర్య వెనుక మూడు లాభాలు. చూశావ్‌రా! నా తర్వాత కౌంటర్ మీద కూర్చోవాల్సింది నువ్వే. కాబట్టి జాగ్రత్తగా నా ట్రిక్కులన్నీ వంట పట్టించుకో తెలిసిందా?" — టింకుతో రహస్యంగా అన్నాడు కౌంటరతను.

**　　**　　**

ఆరోజు కూడా రామారావు టీ త్రాగి కౌంటర్ వద్దకు బిల్ పే చేయడానికి వచ్చాడు.

"బిల్ ఎంత?" అడిగాడు రామారావు.

"డెబ్బయ్ అయిదు పైసలు" పళ్ళికిలిస్తూ రహస్యంగా కొడుకు వంక చూసి కన్నుగీటుతూ చెప్పాడు కౌంటరతను. టింకు కూడా ఉత్సాహంగా ఉన్నాడు.

రామారావు జేబులోంచి మూడు చాక్‌లెట్‌లు కౌంటరతని చేతిలో పెట్టి, "ఒక చాక్‌లెట్ చారానా. అంటే మూడు కలిస్తే డెబ్బయ్‌అయిదు పైసలు. మీరిచ్చిన చాక్‌లెట్‌లే లెండి. లెక్క సరిపోయిందిగా" అంటూ బయటకు నడుస్తుంటే, కౌంటరతను నోరలా తెరచి పెట్టేసాడు!!! టింకు పకపక నవ్వేయసాగాడు!!!

— బల్లెం వేణుమాధవ్

# చురక

## విశాలాక్షికి చురుకెక్కువ

'సత్తిబాబు' అందుకు పూర్తిగా భిన్నం.

ఏ విషయంలో ఇరుగు పొరుగుల కామెంట్స్ ఎలా ఉన్నా విశాలాక్షికి మాత్రం గొప్పబాధ పట్టేసుకుంది. ఎద్దులెండూ సమానంగా లేకపోతే బండినడక ఎలా కష్టమో భార్యాభర్త సమానంగా లేకపోతే సంసారం నడవడమూ ఇబ్బందే గనక ఎలాగైనా సత్తిబాబులో అంటే తన భర్తలో గొప్ప చైతన్యం తీసుకొచ్చి తీర్తానని శపథం చేసి పారేసింది.



రజనీ రంగారావూ స్కూటర్ మీద పోతున్నపుడూ విశాలా మురళీ మారుతీలో దూసుకుపోతున్నప్పుడూ చంచలా నాగేశ్వరావూ చెయ్యీ చెయ్యీ పుచ్చుకుని గుడికో బజారుకో పోతున్నప్పుడూ ఆ శపథం మరింత గట్టిగా చేస్తుంది.

"రండీ" అంటే 'అబ్బా ఉండవే' అంటాడు.

"లేవండి" అంటే 'లేస్తా' అంటూ మళ్ళీ పడుకుంటాడు. అరగంట పనికి గంటన్నర నాన్చుతాడు. ఇదామెకి భరించరానిదిగా అయింది.

ఓ రోజు స్నానం వేళ... సబ్బుతో సుబ్బరంగా రుద్దుకుని తుండుతో ఒళ్ళంతా తుడుచుకుని బట్టలకోసం కేకేశాడు. విశాలాక్షి తను కట్టుకునే ముక్కల చీర తెచ్చి అక్కడ పెట్టింది.

"ఇదేంటే ఇది చీర... నేను మగాణ్ణి" సత్తిబాబు అహం దెబ్బతింది.

'మగాణ్ణి అనుకోగానే సరిపోదండీ. మగాడు మగాడల్లే ఉండాలి. చురుకు లేని మగాణ్ణి ఏ ఆడదీ గౌరవించదు ఇంకో మగాడూ గౌరవించడు' మాటలాపి మరోసారి లోపలికి వెళ్ళింది. చైతన్యంగా అడుగులేస్తూ సత్తిబాబూ లోపలికెళ్ళేడు.

– అడబాల వి.వి.సత్యనారాయణ